


రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:28 గురువారం
సహర్ 4:38 శుక్రవారం

నిప్పుల కొలిమి



తొమ్మిది మండలాల్లో ఆరెంజ్ అలర్ట్

- మరో మూడు రోజులు భగభగలే...

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఫిబ్రవరి మూడో వారం నుంచి తన ప్రతాపాన్ని చూపిస్తున్న సూర్యభగవానుడు ఏప్రిల్ ప్రారంభం నుంచి మరింత తీవ్రరూపం దాల్చాడు. పక్షులు, మూగజీవాలు, వృద్ధులు, చిన్నపిల్లలు, ప్రజలు విలవిలలాడుతున్నారు. మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణ శాఖ ఆయా మండలాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంగాధర మండలంలో అత్యధికంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శంకరపట్నం మండలం కొత్తగట్టులో 41.2, జమ్మికుంట మండలం ధర్మారం-కొత్తపల్లిలో 41, జమ్మికుంట పట్టణం, సైదాపూర్ మండలం వెన్కెపల్లిలో 40.8, మాన కొండూర్ మండలం ఈదులగట్టెపల్లి, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 40.5 డిగ్రీలు, గంగాధర మండలం బూర్గుపల్లిలో 40.3, హుజూరాబాద్ మండలం బోర్న పల్లిలో 40.2, కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుంచే వడగాల్పులు వీచడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అత్యవసరమైతే తప్ప రావడం లేదు. ఇళ్ళలో కూడా ఉక్కపోతనుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వేసుకుంటున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటకు వెళ్లామంటే వడగాల్పులు అన్నట్లు ఉంది పరిస్థితి. ఎండల దాటికి ప్రజలు ఇళ్ల నుంచి 10 తర్వాత రావడం లేదని, రాత్రి 7 గంటల వరకు కూడా వ్యాపారాలు సాగడం లేదని, గిరాకీలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపక్కన వీధి, చిరువ్యాపారులు ఎండ వేడిమిని తట్టుకోనేందుకు గొడుగులు, చెట్ల కింద కూర్చుంటున్నారు. గిరాకీలు లేవని, గతంతో పోలిస్తే సగం గిరాకీ కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. మరో ఐదురోజులపాటు మరింత ఎక్కువగా వేడిగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిర్మానుష్యంగా తెలంగాణ చౌక్

ఆస్తిపన్ను చెల్లింపులపై ఐదు శాతం రిబేట్

- నెలాఖరు వరకు ఎర్లీబర్డ్ స్కీమ్



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5: పట్టణాలు, నగరాల్లో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్తను ప్రకటించింది. మార్చి 31వ తేదీ వరకు ఆస్తిపన్ను బకాయిలపై వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం కింద 90 శాతం వడ్డీ మాఫీ చేసింది. ఈ స్కీం ముగిసిన రెండురోజుల్లోనే గతంలో మాదిరిగా ఎర్లీబర్డ్ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గృహ, వాణిజ్య, వ్యాపార, ఇతర ఇళ్లకు సంబంధించిన ఆస్తిపన్నులు ఈనెల 30వ తేదీ వరకు చెల్లిస్తే పన్నుపై ఐదు శాతం రిబేట్ వర్తిస్తుంది. వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్ ద్వారా మున్సిపాలిటీలకు బకాయిలు వసూలు కాగా ఇంటి యజమానులకు 90 శాతం వడ్డీ మాఫీతో ప్రయోజనం చేకూరింది. గత సంవత్సరం వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఎర్లీబర్డ్ స్కీం వర్తిసుంది. ఈ పథకం కింద ఐదు శాతం రిబేట్ లభిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు.

శ్రీరామ నవమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

కరీంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇల్లందకుంటలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లందకుంటలో ఈనెల 15 నుంచి 27 తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీరామనవమి రోజున జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, క్యూలైన్లు, బారికేడ్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వైద్య సిబ్బంది, మందులను అందుబాటులో ఉంచాలని, 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాను చేయాలని, అగ్నిమాపక సిబ్బంది వాహనాలతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కోనేరు వద్ద గజ ఈతగాళ్లను మత్స్యశాఖ అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఇల్లందకుంటకు నడిపించాలని సూచించారు. లక్షలాదిగా పాల్గొనే భక్తులకు ఎలాంటి సౌకర్యం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, ఇల్లందకుంట ఆలయ ఈవో సుధాకర్ పాల్గొన్నారు.

వైద్యులు బాధ్యతగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3: వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ ఆడిటోరియంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ డాక్టర్లతో వైద్య సేవలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమీక్షకు వచ్చేటప్పుడు అన్ని వివరాలతో హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. వైద్యాధికారులు నిరంతరం ప్రజలతో మమేకం కావాలని, అపుడే మంచి పేరు వస్తుందన్నారు. గ్రామాలతోపాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధిహామి కూలీలు పనిచేసే చోట విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.మంచి పనితీరు కనబరిచినందుకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లను వైద్యాధికారులకు కలెక్టర్ అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ జువేరియా, చందు, డీటీసీవో రవిందర్‌రెడ్డి, డీఎంవో రాజగోపాల్, డీఐవో సాజిదఅతహరి, ఎంసీహెచ్‌పివో సన జువేరియా పాల్గొన్నారు.

కరువు నివారణకు ప్రభుత్వం చర్యలు

- ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మార్నింగ్ వాక్..
- మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, ఏప్రిల్ 3: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న కరువును నివారించేందుకు, ప్రజలను అదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా మండల ప్రజల సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇచ్చిన వినతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకో వాలన్నారు. అధికారులు స్పందించక పోతే తన దృష్టికి తీసుకురావాల న్నారు. కరీంనగర్ పార్లమెంటు నియోజ కవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. తమ ప్రభు త్వం నిర్వహిస్తున్న ప్రజపాలన విధానమే తమకు శ్రీరామరక్ష అని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రైతులపై కపట ప్రేమ చూపుతున్నాయని విమర్శించారు. ఆ రెండు పార్టీల నాయకులు దొంగ దీక్షలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ, మొన్నటి వరకు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలే అధికారంలో ఉన్న సంగతి మరిచిపోయి రాష్ట్ర ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తున్నాయన్నారు. బండి సంజయ్ మొన్నటి వరకు రాముడి ఫొటో పెట్టుకుని అంక్షింతలతో రాజకీయం చేసి, నేడు రైతుల వద్దకు వెళ్లి దొంగ దీక్షలు చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పోలు స్వప్న, జడ్పీటీసీ గీకురు రవీందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



చిగురుమామిడిలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సమస్యలు పరిష్కరించాలి



యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

గణేశ్‌నగర్, ఏప్రిల్ 3: తమ సమస్యలు పరిష్కరించాలని శాతవాహన యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వై కిశోర్ డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఎదుట బోధనేతర సిబ్బంది బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉద్యోగులకు సమాన వేతనాలు ఉండాలని, సర్వీస్ రూల్స్ ఒకే మాదిరిగా ఉండాలన్నారు విశ్వవిద్యాలయ పాలక మండలిలో, సెనేట్లలో బోధనేతర సిబ్బందికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. బడ్జెట్లో విద్యకు ఆరు శాతం కేటాయించాలని, ఆరోగ్య భద్రత విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కల్పించాలన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయాలని, టైం స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సీహెచ్ హరికిషన్, అసోసియేషన్ బాధ్యుడు పి ప్రసాద్, భీమయ్య, రమేష్, రాజేశ్వరి, నర్సయ్య, నూరుద్దీన్, టి రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

హుజూరాబాద్, ఏప్రిల్ 3: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రైతులకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగునీరు లేక పంటలను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం రైతులు అనేక కష్టాల్లో ఉన్నారన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. రైతన్నలు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సాగునీరు లేక నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, 15 వేల రైతు భరోసా కౌలు రైతులకు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించాలన్నారు. సమగ్ర పంటల బీమాను అమలు చేసి రైతులతోపాటు రైతు కూలీలు, భూమిలేని రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కొత్తసాగు విధానంతోపాటు పంటల సమగ్ర ప్రణాళికను విడుదల చేయాలన్నారు. సమావేశంలో విజయచందర్‌రెడ్డి, మాడ గౌతమ్‌రెడ్డి, పుప్పాల రఘు, బింగి కరుణాకర్, నర్సింహారాజు, ఆకుల రాజేందర్, గంగిశెట్టి రాజు, మల్లేష్, ఆదిరెడ్డి, సంపత్‌రావు, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, శశిధర్, రాజు, తిరుపతి, రవి, వెంకటేష్, సంతోష్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, ఏప్రిల్ 3: సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి విమర్శించారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగు నీరందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన పట్ల ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదన్నారు. ప్రభుత్వానికి అధికార యంత్రాంగంపై నియంత్రణ లేదని, ప్రజా సమస్యలను గాలికి వదిలి వేసిందని విమర్శించారు. మిడ్‌మానేరు, ఎల్ఎండీకి ఇతర ప్రాజెక్టుల నుంచి నీటిని తెప్పించి రైతులకు ఆదు కోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని అంటున్న ప్రభుత్వం బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎంపీ బండి సంజయ్ దీక్ష రైతుల కోసమా, లేక ఎన్నికల్లో ఓట్ల కోసమా అనే అను మానాలు కలుగుతున్నాయన్నారు. ఉపాధిహామి కూలీల వేతనాలను ఆరు వారాలుగా పెండింగ్‌లో పెట్టడం శోచనీయమన్నారు. ఈ నెల 6న సీపీఐ శ్రేణులు, ప్రజా సంఘాల ముఖ్య నాయకు సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పైడిపల్లి రాజు, బ్రాహ్మణపల్లి యుగేందర్, మచ్చ రమేష్, మహేందర్, వెంకటేష్, న్యాలపట్ల రాజు,చెంచల మురళి, కేశబోయినరాము, కనకం నరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

లక్షా 2 వేల నగదు పట్టివేత



శాతవాహన యూనివర్శిటీ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్3: కరీంనగర్ శివారులోని విద్యానగర్ ప్రాంతం శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద పోలీసుల తనిఖీలలో లక్షా 2 వేల 400 రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల నియామవళి అమలులో భాగంగా బుధవారం రాత్రి రెండో టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నగదు పట్టుబడింది. రేకుర్తిలోని విజయపురి కాలనీకి చెందిన కొండ మనోహర్ అనే వ్యక్తి వ్యాపారంలో భాగంగా స్థానికంగా కిరాణం షాపుల స్టాకు విక్రయానికి సంబంధించి ఆయా షాపుల యజమానుల నుంచి డబ్బులు తీసుకుని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు చూపించనందున లక్షా 2వేల 400 రూపాయల నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి స్వాధీనం చేయనున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్ట్

ధర్మపురి, ఏప్రిల్ 3: ధర్మపురి మండలంలోని రాయపట్నం భారత్ పెట్రోల్ బంక్ వద్ద మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్ పాల్పడిన కేసులో సిలిగిరి సందీప్ (24), ముంజ రాజేందర్ (19), పోతు అక్షయ్‌కుమార్ (24), మాదస్తు అలేఖ్య (31) అనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి సీఐ రాంనర్సింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు వెల్లడించారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నిందితులు ముఠాగా ఏర్పడి జల్సాలకు అలవాటు పడ్డారు. గత నెల 29న రాయపట్నం గ్రామంలో మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించారు. అక్కడి నుంచి తమ బైక్ పైన వెళ్లి చోరీ చేసిన బంగారాన్ని గత నెల 30న భీంగల్ గ్రామంలో విక్రయించేందుకు ప్రయత్నించారు. నిందితులు సిలిగిరి సందీప్, ముంజ రాజేందర్ కలిసి పోతు అక్షయ్‌కుమార్ అతని భార్య మాదస్తు అలేఖ్య సహాయంతో దొంగిలించిన పుస్తెల తాడును మంచిర్యాలలో విక్రయించేందుకు బయల్దేరారు. రాయపట్నం వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపైన ఉన్న నలుగురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో నిందితులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు మోటార్ బైక్‌లు, 23 గ్రాముల పుస్తెల తాడు, మూడు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

వరదకాలువలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

మల్యాల, ఏప్రిల్ 3: అనార్యోగంతో బాధపడుచున్న ఓ మహిళ వరద కాలువలో దూకి ఆత్మహత్యయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి అనే మహిళ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మల్యాల వచ్చే మార్గంలో గల వరదకాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గమనించి 100కు సమాచారం అందించారు. దీంతో బ్లూకోల్ట్ పోలీసులు ప్రసాద్, నర్సింగరావు అక్కడకు చేరుకొని మహిళను సురక్షితంగా బయటకు తీశారు. నీళ్ల తక్కువ ఉండడంతో ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ మేరకు పోలీసులు ఆమే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం చేయూత వాహనం

గణేష్‌నగర్, ఏప్రిల్ 3: ఆపదలో ఉన్న వికలాంగులు, వయోవృద్ధులను ఆదుకునేందుకు ఉమ్మడి జిల్లాకు చేయూత వాహనం మంజూరైందని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగులను ఆదుకునేందుకు ఈ వాహనాన్ని వారికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆపదలో సహాయం అవసరమైన వయోవృద్ధులు 14567 టోల్ ఫ్రీ నెంబరుకు, దివ్యాంగులు 155326 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. ఫోన్ కాల్ స్వీకరించిన ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి అవసరాన్ని బట్టి చేయూత వాహనం ద్వారా వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు చేరుకుంటారని తెలిపారు. వారికి అవసరమైన సహాయం అందిస్తారన్నారు. వారి పరిస్థితిని బట్టి చేయూత వాహనంలో వారిని ఆస్పత్రికి, కుటుంబ సభ్యుల వద్దకు తరలిస్తారని తెలిపారు. టోల్ ఫ్రీ నంబరు సేవలు, చేయూత సేవలను ఆపదలో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

దేశానికి ఆదర్శంగా కేడీసీసీ బ్యాంకు

● టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



బ్యాంకు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: సమష్టి కృషితోనే కేడీసీసీ బ్యాంకు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని టెస్కాబ్, కేడీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సహకార రంగంలో తెలంగాణ సహకార వ్యవస్థ దేశానికే రోల్‌మోడల్ అని అందులోనూ మన జిల్లా బ్యాంకు అన్ని రంగాల్లో కూడా ఆదర్శంగా ఉందన్నారు. ఇది పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యుల సమష్టి సహకారంతోనే సాధ్యమైందని టెస్కాబ్, కేడీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేడీసీసీబీ 100.10 కోట్ల రూపాయల లాభాలను గడించడంతో పాటు రుణాల వసూళ్ల, డిపాజిట్ల సేకరణలోనూ అగ్రగామిగా నిలువడంతో పాలకవర్గం, అధికారులు, ఉద్యోగులందరినీ అభినందించారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీబీ సమావేశ మందిరంలో జిల్లాలోని కేడీసీసీబీ పాలకవర్గం, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, కార్యదర్శులు, ఇతర ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న కేడీసీసీ బ్యాంకును 2011 నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామన్నారు. ఇక అప్పటి నుంచి లాభాల్లోనే ఉండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సహకార సంఘాలు, బ్యాంకుల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి మనం అమలు చేస్తున్న డిజిటల్, గవర్నింగ్, సుపరిపాలన వంటి సేవలను అధ్యయనం చేస్తున్నారని అన్నారు. గంభీరావుపేట సొసైటీ, కేడీసీసీబీతోనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. పంట రుణాల మంజూరులో జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో బ్యాంకు కేడీసీసీబీయేనని అన్నారు. దేశంలోనే 28శాతం పంట రుణాలు ఇస్తున్నది మనమేనని, మరెక్కడ కూడా 12శాతానికి మించి పంట రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. సన్న, చిన్నకారు రైతులే మన వద్ద రుణాలు తీసుకుంటారని, వారి పట్ల కఠినంగా వ్యవహరించకుండా వాణిజ్య, ఇతర రుణాలపై దృష్టిపెట్టాలని సూచించారు. బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు టీంవర్క్ బాగా ఉందని అన్నారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి బ్యాంకులో నిర్ణయాలు తీసుకుంటూ మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సీఈవో సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ డైరెక్టర్ వుచ్చిడి మోహన్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హన్మంతరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



శైలజ(ఫైల్)

తంగళ్లపల్లి, ఏప్రిల్ 3: ఆర్థిక ఇబ్బందులకు తోడు, తన పెళ్లి కుటుంబ సభ్యులకు భారమవుతుందని మనస్తాపం చెందిన యువతి అత్తరి శైలజ (19) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తరి లక్ష్మి కూతురు శైలజ ఇంటర్మీడియట్ వరకు చదివి మధ్యలోనే ఆపేసింది. పది సంవత్సరాల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా తల్లి లక్ష్మి కూలి పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం శైలజకు నిశ్చితార్థం జరిగింది. పెళ్లి దగ్గర పడుతుండడం ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం ఉండడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 3: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 52మంది రైతులు 694క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఏడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. కనిష్ఠ ధర రూ.6,300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఇరాక్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం



వెంకటేశం (ఫైల్)

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: ఉపాధి కోసం ఇరాక్ వెళ్లగా అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒగులాపూర్ గ్రామానికి చెందిన బైరి వెంకటేశం (40) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామంలో సరైన ఉపాధి లేకపోవడంతో వెంకటేశం ఎనిమిది సంవత్సరాల క్రితం ఇరాక్ వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబరు నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశం మృతి చెందాడు. మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబీకులు ప్రయత్నం చేయడంతో మూడు నెలలకు స్వగ్రామం చేరింది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబీకులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నకిలీ వీసా కేసులో కేరళ ఏజెంట్ అరెస్ట్



వివరాలు తెలుపుతున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి, ఏప్రిల్ 3: మెట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని పలువురికి గల్ఫ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసిన కేరళ రాష్ట్రానికి చెందిన ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలు జిల్లాలకు చెందిన గల్ఫ్ బాధితులను దుబాయికి పంపిస్తామని ఐదుగు రు ఏజెంట్లుగా ఏర్పడ్డారు. వీరిలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన అల్లా రమేష్ అనే వ్యక్తి జిల్లాకు చెందిన 40 మంది గల్ఫ్ బాధితులను దుబాయికి పంపిస్తానని నమ్మబలికాడు. ఏజెంట్ జనవరిలో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 26,500ల చొప్పున మొత్తం సుమారు రూ. 10లక్ష లను వసూలు చేసి నకిలీ విసాలు అందజేశాడు. వారు దుబాయి పోదామని ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా అక్కడి అధికారులు పరిశీలించి ఇవి నకిలీ వీసాలని పంపించేశారు. దీంతో వారు మోసపోయామని గుర్తించి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 48, 51, 52, 67 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకుకొని దర్యాప్తు చేసి ఏ1గా ఉన్న అల్లా రమేష్‌ను ఫిబ్రవరిలో అదుపులోకి తీసుకొని విచారించగా ఇందులో మొత్తం ఐదుగురు ఉన్నట్లు తెలుపగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఏ2గా ఉన్న కేరళ రాష్ట్రానికి చెందిన మహ్మద్ హసీఫ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 3: వరకట్న హత్య కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జ్ ఎన్ ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. చందుర్తి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన రేవతి అలియాస్ శిరీషకు 2017లో కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కంటే నరేష్ అనే వ్యక్తితో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ. 10.50 లక్షలతో పాటు 11 తులాల బంగారం, ఇతర లాంఛనాలు ఇచ్చి పెళ్లి చేశారని ఎస్పీ తెలిపారు. ఏడాదిలో కూతురు జన్మించింది. తర్వాత అదనపుకట్నం, రెండు తులాల బంగారం, గొర్రెలు, ఒక ప్లాట్ ఇవ్వాలని వేధింపులు గురి చేశారని తెలిపారు. వేధింపులకు భరించలేక 19 మార్చి 2021న శిరీష ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఆమె భర్త నరేష్, అత్త, మామ, ఆడబిడ్డను రిమాండ్‌కు తరలించారు. అప్పటి డీఎస్పీ చంద్రకాంత్ కోర్టులో చార్జిషీట్ వేయగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సిఎంఎస్ కానిస్టేబుల్స్ నరేందర్, లతీఫ్‌లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా స్పెషల్ పిపి నర్సింగరావు కేసు వాదించారని తెలిపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత నేరం రుజువు కావడంతో నిందితుడైన కంటె నరేష్‌కు ఏడు సంవత్సరాల కఠిన కారగార శిక్షతోపాటు రూ. 30 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి



సుధారాణి(ఫైల్)

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 3: వారిద్దరిది ప్రేమ పెళ్లి... వీరికి ఓ బాబు పుట్టాడు. బాబు పుట్టి వెంట్రుకల కార్యం చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. శుభకార్యానికి ఒక రోజు ముందే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన రంజిత్ ధర్మపురి మండలం తిమ్మాపూర్‌కు చెందిన సుధారాణిని ప్రేమించి 2020లో కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరు కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరికి హర్షవర్ధన్ అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుడి పుట్టివెంట్రుకల శుభకార్యాన్ని నిర్వహించేందుకు గురువారం ముహూర్తం నిర్ణయించుకున్నారు. అయితే బుధవారం ఉదయం సుధారాణి(26) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. సుధారాణి భర్త రంజిత్ పథకం ప్రకారం వేధింపులకు గురిచేసి హత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ మృతురాలి తల్లి వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. జగిత్యాల డీఎస్పీతో పాటు సీఐ, ఎస్సైలు రంగంలోకి దిగి పూర్తి వివరాలు సేకరించారు. సుధారాణి మృతదేహాన్ని పరిశీలించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘున : రూ. లక్ష జరిమానా

కోనరావుపేట, ఏప్రిల్ 3: బైండోవర్ నిబంధన ఉల్లంఘించిన వ్యక్తికి లక్ష రూపాయలు జరిమానా విధించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన అలిపిరి ఆదిరెడ్డి గతంలో రాత్రిపూట ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోనరావుపేట పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. లక్ష రూపాయల పూచికత్తు మీద వదిలిపెట్టారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఇటీవల పట్టుబడగా కేసు నమోదు చేశారు. బుధవారం లక్ష రూపాయలను ట్రెజరీలో జమచేయడం జరిగిందని అన్నారు. బైండోవర్ నిబంధనలను ఎవరూ ఉల్లంఘించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 210 గ్రాముల గంజాయి పట్టివేత ● ద్విచక్ర వాహనం స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

కోరుట్ల, ఏప్రిల్ 3: నిజామాబాద్ నుంచి కోరుట్లకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో వివరాలను ఎస్‌ఐలు కిరణ్‌కుమార్, శ్వేతలతో కలిసి వివరాలను వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని హాజీపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి టీఎస్ 02 ఈడీ 0698 నంబర్ గల ద్విచక్ర వాహనంపై నిజామాబాదు నుంచి కోరుట్లకు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని వెటర్నరీ కళాశాల వద్ద మంగళవారం రాత్రి ఎస్‌ఐ శ్వేత వాహనాలు తనిఖీ చేస్తుండంగా మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వస్తున్న మహ్మద్ షబ్బీర్ నడిపిస్తున్న ద్విచక్ర వాహనంను తనిఖీ చేయగా వాహనంలో 210 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులగా మహ్మద్ షబ్బీర్ నిత్యం నిజామాబాదు నుంచి కోరుట్లకు గంజాయి తరలించి పట్టణంలో విక్రయించేవాడని తెలిపారు. మహ్మద్ షబ్బీర్‌తో పాటు అతని వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినుట్ల తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ శ్వేత సిబ్బందిని అభినందించారు.

భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

భగత్‌నగర్, ఏప్రిల్ 3: శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తుల ఇంటికే భద్రాద్రి కల్యాణ తలంబ్రాలు అందించే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. బుధవారం కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఆధ్వర్యంలో తలంబ్రాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17న జరగబోయే శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ కల్యాణ తలంబ్రాలను టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా అందిస్తామన్నారు. 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 151 రూపాయలు చెల్లించి కల్యాణ తలంబ్రాలను బుక్ చేసుకోవాలన్నారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌తో పాటు, అన్ని కార్గో బుకింగ్ కౌంటర్లలో, మార్కెటింగ్ ఏజెంట్ల వద్ద కూడా బుకింగ్ సదుపాయం ఉందన్నారు. మరిన్ని వివరాలకు కరీంనగర్ జిల్లా లాజిస్టిక్స్ మేనేజర్ ఎస్ సదాశివ్ సెల్ నెంబర్ 8125459004 సంప్రదించాలన్నారు. తలంబ్రాలు బుక్ చేసుకొనుటకు రీజినల్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ రాజు 9154298581, కరీంనగర్ 9154298561, జగిత్యాల 9985222739, మెట్‌పల్లి 9154298574, హుజూరాబాద్ 9573851108,గోదావరిఖని 9154298554, కోరుట్ల 9963961503,సిరిసిల్ల 9154298576, హుస్నాబాద్ 9951819588 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

హోటళ్లు, బేకరీ, మెస్‌లపై విజిలెన్స్ దాడులు

● శాంపిళ్ల సేకరణ, జరిమానా



హోటల్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3 : కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి, విక్రయాలు జరుపుతున్నారనే ఫిర్యాదులపై కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు అధికారులు బుధవారం కరీంనగర్‌లోని పలు హోటళ్లు, బేకరీలు, మెస్, రెస్టారెంట్‌లపై దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కరీంనగర్ పలు హోటళ్లలో తణిఖీలు చేశారు. విజిలెన్స్ పోలీసులతో పాటు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ శానిటేషన్ అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా కిచెన్‌లలో ఆహార పదార్థాలను తనిఖీ చేసి, శాంపిళ్లను సేకరించారు. ఈ శాంపిళ్లను హైద రాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ ల్యాబ్(ఎఫ్‌ఎస్‌ఎల్)కు పంపించి, పరీక్షల నివేదిక వచ్చిన అనంతరం చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావు, కరీంనగర్ ఇంచార్జి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుజాతలు మాట్లాడుతూ కల్తీ ఆహారపదార్థాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్‌లో పలు హోటళ్లు, రెస్టారెంట్, మెస్‌లలో వంట గదులను శుభ్రంగా ఉంచడం లేదని, ఆహార పదార్థాల నిలువచేయటం, నాణ్యతపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ప్రజలకు నాణ్యతమైన, కల్తీలేని ఆహారపదార్థాలు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమించితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఇప్పటికే తీసుకున్న శాంపిళ్ల రిపోర్ట్ వచ్చిన తరువాత కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామన్నారు. మైసూర్ బేకరీలో కిచెన్ అపరిశుభ్రంగా ఉందని తనిఖీలలో వెల్లడి కావటంతో మున్సిపల్ శానిటరీ అధికారులు మైసూర్ బేకరీ యజమానికి 2 వేల జరిమానా విధించారు. కిచెన్ శుభ్రంగా లేకుంటే కేసు నమోదు చేయటంతో పాటు, బేకరీని సీజ్ చేయనున్నట్లు యజమానికి నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వరుణ్, అనిల్, ప్రసద్, తహసీల్దార్ దినేష్ పాల్గొన్నారు.

పోలీసుల కస్టడీలో ప్రజాప్రతినిధుల భర్తలు



ఆకుల ప్రకాష్‌ను కస్టడీకి తీసుకున్న పోలీసులు



పిట్టల రవీందర్‌ను కస్టడికి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే గాక, బాధితుని భూమి ఆక్రమణకు పాల్పడిన చింతకుంట మాజీ సర్పంచ్, కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి, ఒకే భూమిని పలువురికి విక్రయించి, ముందుగా కొనుగోలు చేసిన విక్రయదారులను మోసం చేసిన విషయంలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను పోలీసులు కస్టడీకి తీసుకుని విచా రిస్తున్నారు. భూకబ్జాల కేసుల్లో మార్చి 26న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో మరింత లోతుగా విచారించి, సమాచారాన్ని రాబట్టేందుకు పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయగా ఈ మేరకు పిట్టల రవీందర్‌ను 48 గంటల కస్టడీకి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు కోర్టు అనుమతించింది. అలాగే ఆకుల ప్రకాష్‌ను కూడా బుధవారం ఉదయం 10 గంటల నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు 24 గంటల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇద్దరిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో భాగంగా పిట్టల రవీందర్, ఆకుల ప్రకాశ్‌ల ఇళ్లల్లో బుధవారం సోదాలు జరిపారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రాచకొండ అశోక్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ ఇల్లంతకుంటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పండలాపూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీనితో గాయపడిన అశోక్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 3: మండలంలోని తారుపెల్లి గ్రామంలో బాసిరి మోహన్, అతడి సమీప బంధువైన శ్రీనివాస్‌ను వ్యక్తిగత కక్షలతో అదే గ్రామానికి చెందిన బాసిరి అంజయ్య, బాసిరి సంపత్, బాసిరి సురేష్‌లు వారి ఇంటికి వెళ్లి కొట్టి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన మోహన్, శ్రీనివాస్‌ను వైద్యం కోసం ఆసుపత్రికి తరలించి బాధితుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు బాసిరి అంజయ్య, బాసిరి సంపత్, బాసిరి సురేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో మార్షల్ ఆర్ట్స్ బెల్టుల ప్రదానం



బెల్టులు, ప్రశంసాపత్రాలతో బిర్లా ఓపెన్‌మైండ్స్ విద్యార్థులు

కరీంనగర్ రూరల్; ఏప్రిల్4: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మార్షల్‌ఆర్ట్స్ బెల్టుల ప్రదానోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థిని, విద్యార్థులకు బెల్టులు అందించారు. ఈసందర్భంగా పాఠశాల ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ విద్య శారీరక దృఢత్వానికి, ఆత్మరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, మార్షల్ ఆర్ట్స్ చీఫ్ కోచ్ వసంతకుమార్, విద్యార్థిని, విద్యార్థులుపాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు ఛాంపియన్‌షిప్

కరీంనగర్ రూరల్; ఏప్రిల్ 3: నగరంలోని వివేకానంద కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ మీట్‌లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఛాంపియన్‌షిప్ సాధించారు. కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 16అంశాలు ప్రొయోజిక్, సంకల్ప్, విశేషక్, నర్తన్, చాయాకృతి, జాగృతి స్వయం, చలనచిత్ర, చిత్రకళతదితర అంశాలలో తమ కళాశాల విద్యార్థినిలు ప్రతిభ చాటి బహుమతులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అఖిల్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 3: ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు అఖిల్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. అకాల మరణానికి తీవ్ర కలత చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక ముకరంపురలో అఖిల్ నివాసంలో ఆయన తల్లిదండ్రులను, పిల్లలను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. అఖిల్ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మోసిన్, టిపిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజ్, మహమ్మద్ అమీర్, ఇమ్రాన్, షహబాస్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

భగత్‌నగర్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్ అన్నారు. బుధవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు 15 వేల రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి దుబాల శ్రీనివాస్, బాస సత్యనారాయణరావు, గుగ్గిల్లపు రమేష్, రాజేంద్రప్రసాద్, కొలగాని శ్రీనివాస్, పురం హరి పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలో వింధ్యావాలి విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 3: జేకేఏఐ షాటోకాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో నగరంలోని వింధ్యావాలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఎల్లో, గ్రీన్, బ్రౌన్, బ్లూ బెల్టులు సాధించారు. రాష్ట్ర కరాటే చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ నిర్వహించిన ఈ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయవాది ఎం హేమలత, జేవికే స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా వివిధ బెల్టులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ ఛైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, కరాటే మాస్టర్లు ఐలయ్య, రమేష్, రవితేజ, భానుతేజలు విద్యార్థులను అభినందించారు.

'ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు రవికుమార్, రావికంటి రాజేందర్, చిట్యాల ఈశ్వరయ్య, కల్లెం కరుణాకర్‌రెడ్డి, పొద్దుటూరి కిషన్‌రెడ్డి, గంగాధర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల నుంచి తొలగించాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 3: అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులు, వివిధ శారీరక రుగ్మతలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదో తరగతి ప్రశ్నాపత్రాలు మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రావుకు తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, కనుమల్ల రవికుమార్, రావికంటి రాజేందర్, ఈశ్వరయ్య, కరుణాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో ఘనంగా ఎల్లమ్మ పట్నాలు

మానకొండూర్, ఏప్రిల్ 3: ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మానకొండూర్‌లో బుధవారం ఎల్లమ్మ పట్నాలు ఘనంగా జరిగాయి. మార్చి 25 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు పట్నాలతో ముగిసింది. మానకొండూర్‌తో పాటు శ్రీనివాస్‌నగర్, సదాశివపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచు రొడ్డ పృథ్వీరాజ్, గడ్డం నాగరాజులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి అధ్యక్షులు బండి చంద్రయ్యగౌడ్, ఉపాధ్యక్షులు తాల్లపల్లి మృత్యుంజయం, డైరెక్టర్లుఉన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్, ఏప్రిల్ 3: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని బుధవారం మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కడారి శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొల్లు బాబు, కనకయ్య, సత్యం, స్వామి, దశరథం, శ్రీనివాస్, నర్సింహ, రఘుపతి, రాములు పాల్గొన్నారు.

● శంకరపట్నం: జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 2నుంచి 8వరకు నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని మాల మహానాడు మండలాధ్యక్షుడు కత్తెరమల్ల కిష్టస్వామి, జిల్లా అధ్యక్షుడు శంకర్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, వెంకన్న, సత్యం, అర్జున్, రాజేంద్రప్రసాద్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్

● మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గంగాధర, ఎప్రిల్ 3: ఉద్దెర హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం గంగాధరలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వినోద్ కుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పొలాల బాట పట్టే సరికి కాంగ్రెస్‌కు భయం మొదలైందన్నారు. ఈ యాసంగికి రైతులకు 5వందల బోనస్ ఇవ్వాలని, ప్రభుత్వం రైతులకు బోనస్ ఇచ్చే వరకు రైతులతో ఆందోళన చేపడతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ శ్రీరాం మధుకర్, నవీన్‌రావు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ రైతులకు అన్యాయం : బీజేపీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 3: మోసపూరితమైన హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆరోపించారు. రైతాంగానికి మద్దతుగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి పంట్టించుకోకపోవడంతో రైతులకు బ్యాంకులు నోటీసులు పంపిస్తున్నాయన్నారు. రూ.500 బోనస్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కరీంనగర్‌లో పోటీ చేసే ధైర్యం లేక హుస్నాబాద్ వెళ్లి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ బండిసంజయ్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు మాడ వెంకట్‌రెడ్డి, కళ్యాణ్‌చంద్ర, మహిపాల్‌రెడ్డి, కొము రయ్య, జగదీశ్వరాచారి, రాపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులు పాఠశాలల అభి వృద్ధిలో భాగస్వాములై అత్యుత్తమ పాఠశాల లుగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పమేలా సత్పతి సమైక్య సంఘాల ప్రతినిధులకు పిలుపు నిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా, మండల సమైక్య సంఘాల ప్రతినిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ పిల్లల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశా లల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమైక్య సంఘాల ప్రతినిధులకు సూచించారు. మరుగుదొడ్లు, కిచెన్ షెడ్స్, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు ఇతర మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పనులు చేపట్టడంలో వీవో అధ్యక్షురాలు కీలకంగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే పనులు చేయవద్దని అన్నారు. చక్కగా పనిచేసి సంఘాల ప్రతినిధులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. పనులు చేయించి నందుకు మూడు శాతం అడ్మినిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం అందిస్తుందని, దీంతో అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశ ముందని అన్నారు. వారం రోజుల్లోగా మండల స్థాయిలో పనుల నిర్వహణపై వర్క్‌షాపులు పూర్తి చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలకు ఇదొక మంచి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో అన్ని పనులన్నీ జూన్ 10లోగా పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కరీంనగర్ రూరల్; ఏప్రిల్3: కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి, మొగ్దుంపూర్, చామనపల్లి, నగునూరు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి సత్యంతో కలిసి ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్ ద్వారా ఐదు దుకాణాలను తనిఖీ ఏశారు. ప్రతి డీలర్లు కొత్త స్టాక్ రిజిష్టర్, బిల్‌బుక్‌లు తీసుకుని మండల వ్యవసాయాధికారితో సర్టిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3: కలెక్టరేట్ ఆవరణలో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుదవారం జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి టీఎన్‌జీవో ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రంలో డీఎంహెచ్‌వోసుజాత సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, రాగి శ్రీనివాస్, మహిళ జేఏసీ ఛైర్మన్ ఇరుమల్ల శారద, సుమలత, నాయకులు సర్దార్ హర్మిందర్‌సింగ్, వెలిచాల సుమంత్‌రావు, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నేరేళ్ళ కిషన్, రమేశ్, శంకర్, కొండయ్య, మన్మీత్‌సింగ్, కాళిచరణ్, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, లింగయ్య, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'రైతుల పేరుతో దొంగ దీక్షలు'

భగత్‌నగర్, ఏప్రిల్ 3: డిల్లీలో 12 వందల మందిని చంపి రైతుల పేరుతో దొంగ దీక్షలు చేస్తున్నారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎంపిగా బండి సంజయ్ ఏం చేశాడని ప్రశ్నించారు. రైతుల ఉద్యమ నేపథ్యంలో న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు.

ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3: చొప్పదండి మండలం పెద్ద కుర్మపల్లికి చెందిన కూకట్ల మల్లయ్య క్యాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేదకు పదివేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బుధవారం జిల్లా ఆసుపత్రిలో కేఏజేపీఎస్, ఏఆర్‌టీ సెంటర్ సంయుక్తంగా మల్లయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యకిరణ్, కేఏజేపీఎస్ అధ్యక్షురాలు టి మమత, సీఎస్‌సీ పీసీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: తండ్రిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి ఏకలవ్య ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయాన్ని అందించారు. నగరంలోని వావిలాలపల్లిలో నివాసముంటున్న కట్టెకోల భవతి తండ్రి ప్రమాదంలో మరణించాడు. నీట్ పరీక్ష కోసం సమాయత్తం అవుతున్న అతను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఫౌండేషన్ సలహాదారు దివ్య పుట్టిన రోజు సందర్భంగా రూ.5000ల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 3: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ సూచించారు. ఎస్‌ఆర్‌ఆర్‌లో బయోటెక్నాలజీ విభాగంలో సయో నోరా వీడ్కోలు వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ బయోటెక్నాలజీ అధ్యయనంతో యువతకు విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. బయో టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య సి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రముఖ సంస్థల్లో సైంటిస్టులుగా, వివిధ రకాల ఫార్మా ఇండస్ట్రీలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఆచార్య మల్లారెడ్డి, బాటని విభాగాధిపతి ఆచార్య శంకర్, మైక్రో బయాలజీ ఆచార్య ముత్తన్న, ఇంగ్లీష్ విభాగ అధిపతి ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

'భారతదేశం సెక్యులర్ దేశం'



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గంగుల, వినోద్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 3: భారతదేశం సెక్యులర్ భావాలు కల దేశమని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన పల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఎస్‌ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాల కిషన్‌తో కలిసి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, మౌలానా ఖాజా అలీమొద్దీన్, రభాని, కమాలోద్దీన్, అబ్బాస్ సమీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే వేగంగా అభివృద్ధి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3: బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కిసాన్‌నగర్‌లో 3,25వ డివిజన్‌లో మార్నింగ్ వాకర్స్, డివిజన్ ప్రముఖులతో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, స్థానిక నాయకులు పెండ్యాల మహేశ్, కామారపు శ్యాం పాల్గొన్నారు.

'బండి సంజయ్ రైతు దీక్షను ప్రజలు నమ్మరు'



మాట్లాడుతున్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 3: ఎంపీ బండి సంజయ్ దొంగ దీక్షను ప్రజలు నమ్మరని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ ఇచ్చిన ఏ హామీ నెరవేర్చకపోగా స్మార్ట్‌సిటీ పనులలో జరిగిన అవినీతిపై ఏఒక్క రోజు మాట్లాడలేదని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రవణ్ నాయక్, బొబ్బిలి విక్టర్, దండి రవీందర్, కుర్ర పోచయ్య, జీడి రమేష్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దన్న సింగ్, బత్తినీ చంద్రయ్య, మెతుకు కాంతయ్య, విద్యాసాగర్, కూన దామోదర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాదాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ మేనేజర్



చొప్పదండిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న డీఎంవో

సైదాపూర్, ఏప్రిల్ 3: రైతులు తాము పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాలలోనే మద్దతు ధర లభిస్తుందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం సీఈవో శ్రీధర్ అన్నారు. బుధవారం సైదాపూర్ మండలంలోని తమ సంఘం పరిధిలోని ఎలబోతారం, రాంచంద్రాపూర్, రాములపల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల, గుండ్లపల్లి, ఘనపూర్ ధాన్యం కొనుగోలు సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతులు దళారులకు తమ ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతుల ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, శుద్ధి చేసి కొనుగోలు సెంటర్‌కు తీసుకురావాలన్నారు.

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్, యాస్వాడ, చాకలివానిపల్లి, చొక్కారావుపల్లి, గోపాల్‌పూర్ గ్రామాలలో బుధవారం డీసీఎంస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు కటికం తిరుపతి, శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

చొప్పదండి : చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మవతి బుధవారం ప్రారంబించారు,చొప్పదండి ప్యాక్స్ అద్వర్యంలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు, మార్కెట్ కార్యదర్శి మల్లేశం,ప్యాక్స్ సీఈఓ కల్లెం తిరుపతిరెడ్డి రైతులు వ్యాపారులు పాల్గొన్నారు, రైతుల ఖాతాలలోకి పది శాతం డివిడెండ్‌ను జమ చేసినట్లు చొప్పదండి ప్యాక్స్ ఛైర్మెన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని తహశీల్దార్ ఇప్పా నరేందర్ అన్నారు. మండలంలోని సుందరగిరి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినవరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలకు వచ్చే దళారులను నమ్మవద్దన్నారు. ఈకార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో కాటం నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రాం జయంత్యోత్సవ కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, ఏప్రిల్ 3: హుజూరాబాద్ పట్టణంలో బాబు జగ్జీవన్‌రాం 116వ నూతన జయంత్యోత్సవ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వేల్పుల రత్నం, గౌరవ సలహాదారులుగా బత్తుల రాజలింగం, మోరె సతీష్, వేల్పుల ప్రభాకర్, అధ్యక్షుడిగా రొంటాల సుమన్, ఉపాధ్యక్షులుగా ఎర్ర కుమార్, గాజుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా తడికమల్ల శేఖర్, కార్యదర్శులుగా మిడిదొడ్డి రాజు, మొలుగు శ్రీధర్, రామగిరి సంపత్ ఎన్నికయ్యారు.

'సాగు, తాగునీటిపై ప్రభుత్వానికి పట్టింపు లేదు'

చొప్పదండి, ఏప్రిల్ 3: ప్రజలు ఓవైపు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేదని, రాజకీయాలపైనే దృష్టిసారిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం చొప్పదండిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు క్షమాపణ చెప్పిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, మండల పార్టీల అధ్యక్షులు మావురం సుదర్శన్‌రెడ్డి, కోల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కెనాల్ కల్వర్టులు



ఇల్లందకుంటలో ప్రమాదకరంగా ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ కల్వర్టు

ఇల్లందకుంట, ఏప్రిల్ 3: ఇల్లందకుంట మండలంలోని ఎస్సారెస్పీ కెనాల్ కాలువలపై 45 ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. డీబీఎం 16 పరిధిలోని ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా పంటలకు నీరు చేరుతుంది. కల్వర్టుల కింద ఉన్న బండరాళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది. కల్వర్టు వద్ద రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

కల్వర్టు వద్ద గొయ్యిని పూడ్చి వేయాలి

– పెరుమాండ్ల శ్రీనివాస్, రైతు, ఇల్లందకుంట

కల్వర్టు పక్కన రహదారిపై ఉన్న గుంతను పూడ్చి వేయాలి. రాత్రిపూట వ్యవసాయ పొలాలకు వెళ్లే సమయంలో చాలా సందర్భాల్లో రైతులు అందులో పడిపోయారు. కెనాల్ కల్వర్టులు కూడా నిర్మించాలి.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 3: జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని ఓ యువకుడు రైలు కింద పడి బుధవారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుడు 25నుంచి 30సంవత్సరాల మధ్య వయస్సు ఉంటాడు. తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదు. నీలి రంగు చొక్కాపై తెలుపు చుక్కల డిజైన్, నలుపు రంగు ప్యాంటు, నలుపు తల వెంట్రుకలు, గడ్డం కలిగి ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రిలోని మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు.

ఆవుల పట్టివేత... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3: కరీంనగర్ శివారులోని నటరాజ్ ఫంక్షన్‌హాల్ సమీపంలో 15ఆవులు, ఒక దూడను గుర్తించి పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. బుధవారం కొందరు అందించిన సమాచారంతో వెళ్ళి చూడగా ఆవులు ఉన్నాయని, వాటిని పక్కనే ఉన్న కామధేను గోశాల సంరక్షణలో ఉంచామని తెలిపారు. ఆవులను కలిగి ఉన్న హుస్సేనిపురకు చెందిన ఎండీ అక్రంపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన ముగ్గురి అంత్యక్రియలు పూర్తి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3: విష గుళికలతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ముగ్గురి అంత్యక్రియలు మంగళవారం అర్ధరాత్రి బొమ్మకల్ పరిధిలోని మానేరు వాగు ఒడ్డున శ్మశాన వాటికలో పూర్తి అయ్యాయి. మొద్దుంపూర్ శ్రీజ, ఆమె కొడుకు రేహాన్స్, తల్లి జయప్రద మృతదేహాలకు కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదే రాత్రి ముగ్గురు మృత దేహాలను శ్మశాన వాటికకు తరలించిన కుటుంబసభ్యులు అక్కడే అర్ధరాత్రి సమయంలో అంత్యక్రియలు పూర్తి చేశారని స్థానికులు తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ అర్బన్: ఎంపీ బండి సంజయ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతుల పట్ల కపటప్రేమ చూపిస్తున్నాడని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఛైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు.

●కరీంనగర్ కల్చరల్: ఆర్డీసీ విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు గోవిందవరం భూశంకర శర్మ రచించిన గ్రంథాన్ని బుధవారం శ్రీగురు మాధవానంద సరస్వతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు కస్పా భూమేశ్వరరావు, మంగళంపల్లి వెంకటేశ్వరశర్మ, మూగ హరిశంకర్, రామక విఠల్ శర్మ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: ఢిల్లీలో జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరైన పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎన్‌సీసీ నుంచి పాల్గొన్న కొత్తపల్లి సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి జె.శ్రీచరణ్, బొమ్మకల్ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.విజయ్ కుమార్‌ను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ తొమ్మిదవ తెలంగాణ బెటాలియన్ కల్నల్ డానియన్ లొద్దము, మేజర్ సుబేదార్ సాగర్‌సింగ్, మాజీ సైనికోద్యోగులు అబ్దుల్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నగునూరులో ఏడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌లో భాగంగా మూడవ రోజు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బెంగుళూరు డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ బీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి శ్రీవాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ పాల్గొన్నారు.

●భగత్‌నగర్: ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల ఆగడాలు అరికట్టాలని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

● చొప్పదండి: చొప్పదండి పట్టణంలో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో మాతృశ్రీ శక్తి సమావేశాలు నిర్వహించారు. మాతృశ్రీ శక్తి జిల్లా అధ్యక్షురాలు రామోజి సంగీత మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేదని, మహి ళలు శక్తిని సమకూర్చుకోవాలని, లవ్ జిహాద్, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను సమర్థవంతంగా ఎదుర్కో వాలని పిలుపునిచ్చారు.

● గంగాధర: ప్రతి ఒక్కకి ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ అవసరమని ఒకినోవా గ్రాండ్ మాస్టర్ వసంత్ కుమార్ అన్నారు. బుధవారం గంగాధర మండలం వివేకానంద విద్యాలయంలో 120 మందికి, సురభి స్కూల్‌లో 62 మందికి బెల్టులను ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు లక్ష్మారెడ్డి, వీరేశం, కరాటే మాస్టర్లు శ్రీనివాస్,సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

●సైదాపూర్: మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు పోలీసులు, బీఎస్‌ఎఫ్ బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఎస్సై జన్ను ఆరోగ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

●రామడుగు: ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని దేశరాజ్‌పల్లిలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. చొప్పదండి సీఐ ప్రకాష్, స్థానిక ఎస్ఐ సురేందర్, సీఐఎస్‌ఎఫ్ షాట్ టీం పోలీసులు పాల్గొన్నారు.

●వీణవంక:మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి, నర్సింహులపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం దేశాయిపల్లిలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ అలయ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

●మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిపన సాయిరి దేవయ్యను పెటిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం రాష్ట్ర అధ్యక్షులు మద్ద లింగన్న ఉత్తర్వులు జారీ చేశారు.

●చొప్పదండి:చొప్పదండికి చెందిన నిరుపేద యువతి వివాహానికి పద్మశాలి సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణానికి చెందిన సాంబారి కావ్య అనే నిరుపేద యువతి వివాహం బుధవారం జరిగింది. ఖర్చుల కోసం పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణహరి ఆధ్వర్యంలో నగదు సేకరించారు. జిల్లా పద్మశాలి సంఘం రూ.18వేలు, కరీంనగర్ పట్టణ సంఘం రూ.11వేలు, వోపా రూ.8వేలు, నేత బజార్ కమిటీ రూ.6వేలతో పాటు ఇతర దాతల నుంచి సేకరించిన మొత్తం రూ.88,310లను యువతి వివాహనికి గాను అందజేసి అండగా నిలిచారు.

●రామడుగు: పేద ప్రజలు వివిద నిర్మాణాలకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వమే ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న బుధవారం జిల్లా కలెక్టర్‌ను ఒక ప్రకటనలో కోరారు. రామడుగు వాగు నుంచి ఇసుక అనుమతి ఇవ్వాలని ఆమె కోరారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వాహనాన్ని కేంద్ర బలగాలు, పోలీసులు తనిఖీ చేశారు. ఈ మేరకు కృష్ణారెడ్డి పోలీసులకు సహకరించారు.